క్లుప్తంగా

కంటి విషయంలో జాగ్రత్త అవసరం



ఈలకొలనులో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రంగంపేట: కంటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా సేవాదళ్ సహాయ సమన్వయకర్త తిక్కిశెట్టి గోవిందరాజులు అన్నారు. ఈలకొలను సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో బుధవారం వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యాలయ సిబ్బంది సహకారంతో స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గోవిందరాజులు మాట్లాడుతూ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

పంట బీమా చేయించుకోవాలి

రంగంపేట: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులదరూ తప్పకుండా క్రాప్ ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం సాయంత్రం మాట్లాడుతూ బీమాకు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే సమయం ఉందన్నారు. ఎకరానికి రూ.577 చెల్లించి ఈ సేవా కేంద్రాలలో బీమా చేయించుకోవచ్చని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: అల్పపీడన ప్రభావంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ సమాచారం మేరకు రానున్న ఐదు రోజులపాటు అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. పిడుగులు, అధిక గాలులు, నీటిముంపు వంటి పలు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు మీ పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. ఎవరికీ ఏ విధమైన సెలవులు మంజూరుకు అనుమతి లేదని తెలిపారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. దానికి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్‌గా ఉంటారన్నారు. అత్యవసరమైతే ఈ నంబర్‌కు 9505132306 ఫోన్ చేయవచ్చన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ మల్లయ్యపేట– పురుషోత్తపట్నం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం 33/11 కేవీ మిర్తిపాడు, కాటవరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్లకు సరఫరాను నిలిపివేస్తామన్నారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక, బొబ్బిల్లంక, కూనవరం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు చిత్తు



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రంగంపేట: మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్తు చిత్తవుతుందని, వాటిని అందరూ దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై ఎస్ఎస్ఎస్‌డీవీ ప్రసాద్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తాగడం వల్ల శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. గుండె, కాలేయం, మెదడు వంటి అవయవాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉందుర్తి సుబ్బారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

15న విశ్వశాంతి కోసం సద్భావనా ర్యాలీ

రంగంపేట: విశ్వశాంతి కోసం మహా కరుణ శాకాహార సద్భావనా ర్యాలీని ఈ నెల 15వ తేదీన రంగంపేటలో నిర్వహిస్తున్నట్లు రంగంపేట ఓషో ధ్యాన ఆశ్రమం నిర్వాహకులు వసంత్, నారాయణమ్మ తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర వేడుకల కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కానవరం శ్రీను, కోనసీమ పిరమిడ్ సేవా అధ్యక్షులు అనిత, ద్రాక్షారామం రామారావు, మోహన్, పలివెల శ్రీను, తదితరులు హాజరవుతున్నారన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

షెల్టర్.. ప్లీజ్

- రహదారిపై బస్టాండ్ లేక విద్యార్థుల అవస్థలు
- నన్నయ, జీజీయూ వద్ద కొరవడిన సౌకర్యాలు
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ఇబ్బందులు



బస్టాప్ లేక జీజీయూ వద్ద హైవేపై విద్యార్థుల అవస్థలు

రాజానగరం: జిల్లాలో ఆ రెండూ పేరొందిన యూనివర్సిటీలు. ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. హైవేని ఆనుకొని ఉండటంతో బస్సు దిగి అటు పక్క నుంచి ఇటు రావలంటే ప్రతిరోజూ వారికి సాహసమే. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడాల్సిందే. ఇదీ నన్నయ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీల గేటు బయట పరిస్థితి. ఈ రెండు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గేటు బయట ఆర్టీసీ బస్సులు ఎక్కాలన్నా, దిగాలన్నా ఇబ్బంది పడక తప్పట్లేదు. గత మూడేళ్లగా వారు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రతి నెలా నిర్ణీత మొత్తాల్లో సొమ్ములు చెల్లించి బస్సు పాస్‌లు తీసుకుంటున్నా, వాటిని వినియోగించుకోవడానికి కూడా అవస్థలు పడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. వారు ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక బస్సుల కోసం హైవేపై అటు ఇటు పరిగెడుతూ, ఒక్కోసారి ప్రమాదాలకు కూడా గురవుతున్నారు.

డివైడర్ దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి

జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) లలో సుమారు 8,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 2,450 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే విద్యాలయాలకు వచ్చి, వెళ్తుంటారు. జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించిన సమయంలో పై విద్యాలయాల వద్ద ప్రత్యేకంగా బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేసి, రహదారికి సబ్‌వేగా కొంత స్థలాన్ని వదలడంతో బస్సులు ఆ ప్రాంతంలో ఆగేవి. మూడేళ్ల క్రితం జీజీయూ (గైట్ కాలేజ్) నుంచి నన్నయ యూనివర్సిటీ వరకు రహదారికి ఇరువైపులా సబ్‌వేలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో నిర్మించాల్సిన బస్ షెల్టర్ విషయాన్ని విస్మరించడంతో సమస్య తీవ్రతమైంది. ఇరువైపుల ఉన్న ఈ రహదారిపై అవతలి వైపు బస్సు దిగిన వారు ఇటువైపు రావాలన్నా, ఇటు నుంచి అటు వెళ్లాలన్నా డివైడర్‌ను దాటుకొని వెళ్లాల్సి వస్తుంది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ వేరొక ప్రత్యామ్నాయం లేక ఆ విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సబ్‌వేల ఏర్పాటు సమయంలో జీజీయూ వద్ద మూసివేసిన జంక్షన్‌ను తిరిగి పునఃరుద్ధరించారు. కానీ, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు వీలుగా బస్ షెల్టర్‌ను పునఃరుద్ధరించలేదు. ఇక నన్నయ యూనివర్సిటీ వద్ద పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది. ఇక్కడ జంక్షన్ లేకపోవడంతో యూనివర్సిటీకి వచ్చే విద్యార్థులు అటువైపు బస్సు దిగి ఇటు వైపు రావాలంటే తీవంగా శ్రమించాల్సి వస్తుంది. అలాగే తిరిగి వెళ్లే సమయంలో బస్సులు ఎక్కాలన్నా ఇదే పరిస్థితి. ఈ సమస్యను అధిగమించేలా ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

బస్టాప్‌లను ఏర్పాటు చేయాలి



నన్నయ, జీజీయూ విద్యాలయాల వద్ద గతంలో మాదిరిగా బస్టాప్‌లను ఏర్పాటు చేయాలి. జీజీయూ నుంచి 'నన్నయ' యూనివర్సిటీ వరకు వేసిన సబ్‌వేలలోనే బస్టాప్‌లను పై రెండు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. అలాగే నన్నయ యూనివర్సిటీ వద్ద రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోనూ బస్టాప్‌ను ఏర్పాటు చేసి, అక్కడ దిగిన విద్యార్థులు యూనివర్సిటీలోకి వచ్చేందుకు వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి.

– అశిత్ దినేష్‌వర్మ, నన్నయ యూనివర్సిటీ విద్యార్థి.

బస్సుల కోసం నిరీక్షిస్తున్నాం



జీజీయూ వద్ద జాతీయ రహదారిపై జంక్షన్ ఉన్నా.. రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో సబ్‌వే పొడవునా ఐరన్ వేయడం వల్ల ఆ మార్గంలో బస్సుల కోసం నిరీక్షించే వారంతా రహదారిపైనే ఆగాల్సి వస్తుంది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పడం లేదు. ఇక్కడ సబ్‌వే వైపునకు వెళ్లేందుకు మార్గాన్నిచ్చి, అదే ప్రాంతంలో బస్సులు ఆగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాజిమొగ్గల విశాలాక్షి, బీటెక్, విద్యార్థిని

ఏడీబీ రోడ్డు పనుల పరిశీలన



వడిశలేరులో ఏడీబీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ వర్మ

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు సెంటర్‌లో జరుగుతున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆర్అండ్‌బీ డీఈ బి.వర్మ పరిశీలించారు. ఇష్టారాజ్యంగా ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని ఈ నెల 4వ తేదీన ఇండియన్ యాక్ట్స్ ఎవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ కుందేటి వెంకట రమణ రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈ వర్మ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి కుందేటి వెంకట రమణ సమస్యను డీఈ కి వివరించారు. వడిశలేరు సెంటర్‌లో రోడ్డు పక్కన నిర్మిస్తున్న డ్రైనేజీ విషయంలో కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ నచ్చిన చోట ఒక విధంగా, నచ్చని చోట మరొక విధంగా వంకర టింకరగా నిర్మిస్తున్న ప్రాంతాన్ని సూపించారు. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ఉందని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని డీఈ వర్మను కోరారు.

తోట సుబ్బారావు సేవలు మరువలేనివి



దొడ్డిగుంటలో తోట సుబ్బారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మరిడియ్య తదితరులు

రంగంపేట: దివంగత మాజీ మంత్రి తోట సుబ్బారావు సేవలు మరువలేనివని ప్రముఖ రాజకీయ, సినీ విశ్లేషకుడు అడబాల మరిడియ్య అన్నారు. దొడ్డిగుంట గ్రామంలోని బాల గణపతి అలయ ఆవరణలో బుధవారం ఉదయం తోట సుబ్బారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మరిడియ్య ముందుగా సుబ్బారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోట సుబ్బారావు రంగంపేట ఫిర్కాకి ఆరవ శాసన సభ్యుడిగా 1983లో ఎన్నికై, ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. రంగంపేట మండలంలోని ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించి, తాగునీటి సమస్య తీర్చారన్నారు. రైతులకు వ్యవసాయ బోర్లు అందుబాటులోకి తీసుకువచ్చి రైతు బాంధవుడయ్యారన్నారు. జగ్గంపేట నియోజకవర్గం నుంచి వరసగా మూడుసార్లు శాసన సభ్యుడిగా హాట్రిక్ విజయం సాధించిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో గణపతి ఆలయ కమిటీ చైర్మన్ వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, బోడాబత్తుల రాంబాబు, కర్రి దుర్గయ్య, అడబాల సత్యనారాయణ, తోట బాబ్జీ, అడబాల బుల్లిరాజు పాల్గొన్నారు.

పంట చేలకు ఎలుకల బెడద



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

బిక్కవోలు: మండల పరిధిలోని రంగాపురం, ఇల్లపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి సహాయ వ్యవసాయ సంచాలకులు డీవీ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం పొలాలన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని, కొన్ని పొలాలలో ఎలుక ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందన్నారు. వీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కొద్ది రోజులలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, దీనికి సంబంధించిన మందు ఇప్పటికే డివిజన్ కార్యాలయాల వద్దకు చేరిందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.శామ్యూల్ జాన్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరి పంటకు నల్లి ఆశించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దాని నివారణకు ప్రొఫెనోపాస్ లేదా సల్ఫర్‌కు సంబంధించిన మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు కేఎం భాస్కర్ రెడ్డి, కె.శ్రీనివాసు, వీహెచ్ఏ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా చవితి ఉత్సవాలు

బిక్కవోలు: వినాయక చవితి ఉత్సవాలను నిబంధనల ప్రకారం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం కొంకుదురులో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అశ్లీల కార్యక్రమాలు పెట్టకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం, చినకొండేపూడి పీఏసీఎస్‌లో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీతానగరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మట్ట వెంకటేశ్వరరావు, పర్సన్‌లుగా ముళ్ల సుబ్బారావు, మట్ట నాగేశ్వరావు, చినకొండేపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కాండ్రు శేఖర్, పర్సన్లుగా సురేష్, పద్మనాభం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

సీతానగరం: గ్రామంలోని దేవాంగుల వీధికి చెందిన 16 ఏళ్ల బండారు ఈశ్వర దుర్గ నాగ చైతన్య స్వామి (చైతు) కనిపించట్లేదని తల్లి సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు బుధవారం తెలిపారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న చైతు మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి చేరుకున్నాడు. అతడిని తండ్రి ఫణీంద్ర మందలించాడు. బుధవారం తెల్లవారుజాము నుంచి అతడు కనిపించట్లేదని, బంధువులు, స్నేహితుల ఇంటికి వెళ్లిన ఆచూకి తెలియకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇంకా మురికి బతుకులేనా.!



వినతిపత్రం ఇస్తున్న అంబేడ్కర్ నగర్ వాసులు

సీతానగరం: తాము పన్నులు చెల్లిస్తున్నాం, మరి మాకెందుకు డ్రైనేజీలు లేవంటూ ఎస్సీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చినకొండేపూడి పంచాయతీ అధికారులకు అంబేడ్కర్ నగర్ వాసులు పత్తి వెంకటేష్, సానంపూడి సూర్యచంద్రం, బంటుమెల్లి ఏసు తదితరులు డ్రైనేజీలు ఏర్పాటు చేసి, మురికి నీరు వెళ్లేందుకు మార్గం చూపాలని వినతి పత్రం అందించారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఇరు వైపుల నీరు నిలిచిపోయి ఉందని, కొద్దిపాటి వర్షం వస్తే రోడ్డుపైకి నీరు వస్తుందన్నారు. అధిక వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు చేరుతుందని పేర్కొన్నారు. అక్కడే ఉన్న అంగన్వాడీ సెంటర్, హెల్త్ సెంటర్‌లకు మురికి నీటి లోంచి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కచ్చా డ్రైన్‌లు ఏర్పాటు చేసి, మురికినీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరారు.

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి అభినందన



తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. తాడేపల్లిలో జగన్‌ను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బుధవారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆవిర్భావానంతరం అనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న దారుణాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని జగన్ అన్నారన్నారు. కూటమి నాయకులు పెట్టే ఇబ్బందులను తట్టుకుంటూ, ప్రజలకు అండగా ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తన తీరును అభినందించారన్నారు. పేదల ఇళ్ల కూల్చివేతలు, మట్టి అక్రమ తవ్వకాలు, పేకాట క్లబ్‌ల నిర్వహణ, బెల్టుషాపులు తదితర వాటిపై చేస్తున్న పోరాటం, ఆధారాలతో సహా ప్రజలకు వివరించిన తీరును ప్రశంసించారన్నారు. దోమాడ ఘటనలో బాధితుల పక్కన నిలిచిన పోరాటానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.

అవయవదానంతో ఎనిమిది మందికి పునర్జన్మ

అనపర్తి: మరణానంతరం అవయవాలను దానం చేయడం వల్ల మరో ఎనిమిది మంది ప్రాణాలను కాపాడవచ్చని రాజమండ్రి సన్ స్టార్ హాస్పిటల్ వైద్యులు జమ్ము, డాక్టర్ కోదండరామ్, డాక్టర్ నక్కా సుధాకర్ అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పొలమూరు శ్రీనివాసం ఫంక్షన్ హాల్‌లో కమ్యూనిటీ పారా మెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) అనపర్తి, బిక్కవోలు మండలాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న న్యూరోసర్జన్ డాక్టర్ జమ్ము, కోదండరామ్ మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవ దానం వల్ల పది మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రభుత్వం వారి జీవన్ దాన్ పథకంపై అవగాహన కల్పించారు. అలాగే మెదడుకు వచ్చే రుగ్మతల గుర్తింపు, వాటికి అందించే ప్రాథమిక చికిత్సలను వివరించారు. ఎమర్జన్సీ క్రిటికల్ కేర్ వైద్యులు ఎన్.సుధాకర్ మాట్లాడుతూ మరణించిన వ్యక్తి మూత్రపిండాలు, గుండె, క్లోమం, కళ్లు, ఊపిరితిత్తులు వంటి అవయవాల దానం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ప్రాణాలను రక్షించవచ్చన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ కె.భాగ్యప్రీతి గర్భకోశ వ్యాధులపై అవగాహన కల్పించారు. యూరాలజిస్ట్ డాక్టర్ కె.హరీష్ కిడ్నీలో వచ్చే రాళ్లపై వివరించారు. కిడ్నీ దానం చేసేటప్పుడు తీసుకునే జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర మీడియా కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి డి.సాయిరామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, ఎస్ఎస్ చలం, కేఎస్ఎన్ మూర్తి, పి.బాలసుబ్రహ్మణ్యం, డీఎం వెంకటపతిరాజు, ఇజ్జు తిరుపతిరావు, సాగి సూర్యనారాయణ రాజు, ఎస్.నరేంద్ర రెడ్డి, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలకు సారవంతమైన నేలలు



పామాయిల్ మొక్కను రైతుకు అందజేస్తున్న దృశ్యం

సీతానగరం: పామాయిల్ తోటలకు అనుకూలమైన, సారవంతమైన నేలలు సీతానగరం మండలంలో ఉన్నాయని పతంజలి డీజీఎమ్ ప్రకాష్ తెలిపారు. బుధవారం సీతానగరంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఆయిల్‌పామ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో పామాయిల్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా రైతులకు పామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, పామాయిల్ తోటల సాగులో కొత్త విధానాలు అవలంబించడం ద్వారా రైతులు అత్యధిక ఆదాయం పొందుతున్నారన్నారు. పంట ప్రాముఖ్యత, యాజమాన్యం సాగులో మెళకువలు గురించి వివరించారు. మండల ఉద్యానవన శాఖాధికారి రిని మాట్లాడుతూ, పామాయిల్ సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాల ప్రోత్సహకాలు, సూక్ష్మ సేద్యంలో ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో సౌమిత్రి, వీహెచ్ఏ దుర్గాప్రసాద్, సత్య, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ వీరబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు

లక్ష్యంతో సమాజ హితంగా ఎదగాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, ఎస్పీ నరసింహకిషోర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులంతా తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించి, సమాజ హితంగా ఎదగాలని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ విద్యార్థులకు సూచించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటరులో బుధవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ వీక్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ, ర్యాగింగ్ వంటి ఆకతాయి చేష్టల వల్ల భవిష్యతు నాశనమవడమే కాకుండా తల్లిదండ్రులకు కూడా తలవంపులు తీసుకువస్తారనే విషయాన్ని ప్రతి విద్యార్థి గ్రహించాలన్నారు. శరీరకంగా, మానసికంగా ఇతరులను బాధపెడితే చట్ట ప్రకారం శిక్షలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తుచేశారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిస్తూ, విలువలతో కూడిన జీవనాన్ని సాగించాలన్నారు. ర్యాగింగ్‌కి దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబర్ 25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం



గోదావరి బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రకాశం నగర్: గోదావరి బాలోత్సవం మూడో పిల్లల పండగను అక్టోబర్ 25, 26వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిల్లల పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడిందన్నారు. గతంలో అన్ని స్కూళ్లకు రిజిస్ట్రేషన్ ఫారాలు ఇచ్చామని, వాటిని ఇప్పుడు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ ఏడాది 24 అకాడమిక్, 13 కల్చరల్ అంశాల్లో జూనియర్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో దాదాపు 70 పోటీలు జరుగుతాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు దరఖాస్తులను అందజేశామన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బాలోత్సవం అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణకుమార్, ఉపాధ్యక్షుడు నవీన కుమారి తదితరులు పాల్గొన్నారు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

కంబాలచెరువు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ఆ కాలేజీలో బుధవారం నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈగిల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.సురేష్, రసాయన శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు లోను కాకుండా, క్రమశిక్షణతో మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈగిల్ కమిటీ డిస్ట్రిక్ట్ సీఐ పీవీ సూర్యమోహన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం ద్వారా సమాజ నిర్మాణంలో గొప్ప పాత్ర పోషించవచ్చన్నారు. ఈగిల్ కమిటీ ఆర్ఐ నారాయణ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేష్, రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఈగిల్ కమిటీ సభ్యులు జె.యాకూబ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ జి.రవితేజ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ సేవలను వినియోగించుకోవాలి

కడియం: మండల కేంద్రమైన కడియంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం సేవలను సద్వినియోగం చేసుకోవాలని వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ ఏఏవీ లక్ష్మి కోరారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని కులాలకు చెందిన విద్యార్థినులు ఈ హాస్టల్‌లో చేరవచ్చన్నారు. డ్రాపవుట్ విద్యార్థులను కూడా తిరిగి స్కూల్లో చేర్పించి, హాస్టల్లో వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూతో భోజన సదుపాయం ఉంటుందన్నారు. పదో తరగతి విద్యార్థినులకు ఇంగ్లిష్, హిందీ, లెక్కలు, సైన్స్ సబ్జెక్టులకు ట్యూషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే యోగా, కరాటే కూడా నేర్పిస్తున్నామన్నారు. ఈ మేరకు పోస్టర్ల ద్వారా ప్రతి గ్రామంలోనూ విస్తృత ప్రచారం చేస్తున్నామని ఏఏవీ లక్ష్మి తెలిపారు.